ప్రజాశక్తి
ఆదివారం 4 డిసెంబర్ 2022 5 అనంతపురం





ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజును గెలిపించుకుందాం

◆ నిరుద్యోగులు, యువత గొంతుకగా మండలికి పంపాలి

◆ ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశంలో నేతల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వెనుకబడిన ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన నిరంతరం శ్రమిస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు బాటలు వేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు విజయాన్ని కాంక్షిస్తూ సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆవాజ్, కెవిపిఎస్, ఎన్‌పిఆర్‌డి, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం, పండ్ల తోటల రైతుసంఘం తదితర ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, అందరికీ విద్య, వైద్యం, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి, ప్రతి ఒక్కరికీ ఉపాధి కోసం పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పాలక, ప్రతిపక్ష పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎలాంటి ప్రజా ఉద్యమాల చరిత్ర లేదన్నారు. కోట్ల రూపాయల డబ్బును వెదజల్లి గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చి అధికార బలం, ధనబలంతో గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి ఏనాడూ శాసనమండలిలో ప్రజల సమస్యలపై మాట్లాడింది లేదన్నారు. ఆయన కుమారుడే తిరిగి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ రోజూ ప్రజా సమస్యలపై మాట్లాడని నేతలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తే వాటిపై ఏ రోజు మాట్లాడింది లేదన్నారు. బిజెపితో పగలు కొట్లాడుతున్నట్లు నటిస్తూ, రాత్రిపూట ఆ పార్టీ నేతలతో మిలాకత్ అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎం ప్రజాసంఘాల నేతలు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుని పోతుల నాగరాజు గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరి, క్రిష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి,రమేష్, వరూర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వికలాంగుల ఐక్య వేదిక కార్యదర్శి రామయ్య, పండ్ల తోటల రైతు సంఘం శ్రీనివాసులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ కె-6కు కాలం చెల్లుతోందా.?

◆ కెఎల్ 1812పై రైతుల్లో నిరాసక్తత

◆ తగ్గుతున్న దిగుబడులు





కొత్తరకం వేరుశనగ కోసం.. ఎదురుచూపు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే పంట వేరుశనగ. అయితే ఈ పంటకు అవసరమైన నూతన వంగడాలు సకాలంలో అందుబాటులోకి రావడం లేదు. వేసిన రకమే వేస్తూ పోవడం మూలంగా పంటల దిగుబడులపైనా ప్రభావం పడుతోందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పంట దిగుబడులు క్రమంగా తగ్గుతూపోవడంతో రైతులు ఆ పంట సాగుపైనే ఆసక్తి చూపే పరిస్థితి లేకుండాపోతోంది. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 16 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాధారణంగా సాగయ్యేది అది ఇప్పుడు పది లక్షల ఎకరాల్లోపు వచ్చేసింది. ఈ పంటలకు ప్రధానమైన సమస్య విత్తనంలో కొత్త రకాలు ఇతర వాటిల్లో అంతగా రావడం లేదు. దశాబ్దకాలానికి ఒక కొత్త రకం కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో రైతులు వేసిన పంట రకాలనే వేస్తూ పోవాల్సిన వస్తోంది. 1980వ దశకం నుంచి 2005 వరకు కూడా దాదాపు మూడు దశాబ్దాల వరకు జిల్లాను శాసించినది టిఎంవి-2 అనే రకం ఒక్కటే. అది వేసివేసి దిగుబడులు తగ్గిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చింది. ఆ తరువాత కదిరి-6 రకం అందుబాటులోకి వచ్చింది. 2005 తరువాత అందుబాటులోకి వచ్చిన ఈ రకం కూడా 2015లో దీనిపై చేసే రైతులకు అందజేస్తున్నారు. ఇది క్రమంగా దిగుబడి తగ్గుతూవస్తోంది. కొత్త రకాల కోసం రైతులు సైతం ఎదురు చూస్తున్నారు. ఐదేళ్లలనే కెఎల్1812 రకాన్ని (కదిరి లేపాక్షి) రకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ రకంపై ఆదిలోనే రైతుల నుంచి విముఖత వ్యక్తమవుతోంది.

కెఎల్ 1812పై నిరాసక్తత

కదిరి-6 స్థానంలో కెఎల్1812 రకాన్ని కదిరి వ్యవసాయ పరిశోధాన క్షేత్రం నుంచి తీసుకొచ్చారు. ఇది అటు బెట్ట, అధిక వర్షాల రెండింటికీ తట్టుకుని నిలబడుతుందని భావించారు. అంతేకాకుండా నూనె కె-6లో 48 శాతముంటే ఇందులో 51 శాతముంటుందని భావించారు. పల్లిని తిన్న సమయంలో కాస్త చేదు వస్తోంది. ఈ ఒక్క ప్రతికూలతతో ఈ పంట సాగుపై రైతులు వెనుకడుగు వేస్తున్నారు. లేకపోతే అంతకు మునుపు ఏడాది ఈ రకం విత్తనం కోసం రైతులు పెద్దఎత్తునే పోటీపడ్డారు. క్వింటా రూ.22 వేల వరకు ధర పలికింది. గత ఖరీఫ్ నుంచి ఈ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గత ఖరీఫ్‌లో 2.30 లక్షల క్వింటాళ్ల సబ్సిడీపై ఇస్తే అందులో 40 వేల క్వింటాళ్లు ఏపీ సీడ్స్ వద్ద మిగిలిపోయాయి. ఇందులో 25 వేల క్వింటాళ్లు కెఎల్ 1812 రకముంటే మూడు వేల క్వింటాళ్లు మాత్రమే రైతులు తీసుకున్నారు. ఇక రబీలో అయితే ఇప్పటి వరకు 32 క్వింటాళ్లు మాత్రమే తీసుకున్నారు. తీసుకోవడానికి రైతులు ముందుకు రావడడం లేదు.

టిసిజిఎస్ 1694 అయినా సక్సెస్ అయ్యేనా..?

ఇప్పుడు తిరుపతి రకాన్ని తిరుపతి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో కొత్తగా రూపొందించారు. ఇప్పుడు ఈ రకం సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మంచి దిగుబడులే ఇస్తున్నట్టు రైతులు భావిస్తున్నారు. అయితే ఇంకా ఇది ప్రాథమిక దశలోనే ఉంది. ప్రభుత్వం వైపు నుంచి కూడా నోటిఫై అవ్వాల్సి ఉంది. నోటిఫై అయి పెద్ద స్థాయిలో సాగులోకి వస్తేగాని ఇందులో అనుకూలత, ప్రతికూలతపై స్పష్టత వచ్చే పరిస్థితి లేదు. మొత్తంగా వేరుశనగ సాగులో పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా దిగుబడులు పెరిగే కొత్త రకాలు అందుబాటులోకి రావడం లేదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. దిగుబడులు పెరిగే మంచి రకాలు ఎప్పటికప్పుడు అందుబాటులోకి రాపోతే వేరుశనగ సాగు జిల్లాలో కష్టసాధ్యమవుతుందని వ్యవసాయ నిపుణులు సైతం చెబుతున్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కళ్యాణదుర్గం : నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స వారికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో మంత్రి ఉషశ్రీచరణ్ అందజేశారు. సుమారు రూ.2.2లక్షల విలువజేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది

కళ్యాణదుర్గం : ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని తహాశీల్దార్లు శంకరయ్య, బాలకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఓటుహక్కు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు అనే రెండు అక్షరాల పదం ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్లు వంటివి అన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడానికి ఓటును ఆయుధంగా వాడుకోవాలన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 326 ద్వారా కుల, మత, ప్రాంత, లింగ, జాతి, మత, భాష బేధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ ఓటుహక్కు కల్పించారన్నారు. కావున ఓటును మద్యానికి, డబ్బుకు అమ్ముకుని బానిస కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, వివేకానంద కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు వాలంటీర్ల పోస్టులకు ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4, 5, 9, 12, 18వ సచివాలయాలకు సంబంధించి 7 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని గొళ్ల గ్రామంలో నిర్మించనున్న నూతన శివాలయానికి మంత్రి ఉషశ్రీచరణ్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి తనవంతు సాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

డి.హీరేహాల్ : మండలంలోని గుడిసెలపల్లి, కుడ్లూరు గ్రామాల్లోని లబ్ధిదారులకు శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి రామలక్ష్మి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్ల పట్టాలతోపాటు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, రాళ్ల తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కెజిబివిలో ఏం జరిగింది..?

◆ ఘటనపై కలెక్టర్, మంత్రి ఆరా

◆ విద్యార్థులంతా క్షేమం

◆ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి



కెజిబివిలో పాలప్యాకెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్, శింగనమల

ఫుడ్‌పాయిజన్ కలకలం రేగిన శింగనమల కెజిబివి పాఠశాలలో ఏం జరిగిందని అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి ఆ పాఠశాలలో చిక్కీలు తిన్న అనంతరం విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పాఠశాల సిబ్బందిని విద్యార్థినులను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులకు తరలించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు విద్యార్థులకు చికిత్సలు అందించారు. కాగా విద్యార్థులెవరికి ఎలాంటి ప్రమాదం లేకుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు. దీంతో వైద్యులు వారిని డిశ్చార్జి చేశారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు స్పందించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సేకరించారు. శుక్రవారం అర్ధరాత్రి మంత్రి ఉషశ్రీచరణ్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. శనివారం ఉదయం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కెజిబివి పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి, వారికి ఇచ్చిన చిక్కీలు, పాలు, కూరగాయాలను పరిశీలించారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : కలెక్టర్

శింగణమల కెజిబివి విద్యాలయంలో విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఉదయం పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యాలయంలో భోజన శాల, వంట సామగ్రి, విద్యార్థినిల వసతి గదులను పరిశీలించారు. వసతి గహంలో పరిస్థితిపై విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజనింగ్ ద్వారానే పిల్లలు అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామన్నారు. స్నాక్స్, ఇతర ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం పంపామని, ఈ నివేదికలు రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి బాగా ఉందని తెలిపారు. అందరినీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. సోమవారం నుంచి కెజిబివి యథావిధిగా కొనసాగుతుందన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, ఆర్జేడీ వెంకట కష్ణా రెడ్డి, డీసీహెచ్ఎస్ కష్ణవేణి, డిఎంహెచ్ఒ యుగంధర్, ఎస్ఎస్ఎ అడిషనల్ కోఆర్డినేటర్ తిలక్ విద్యా సాగర్, సిహెచ్‌సి సూపరింటెండెంట్ రోషన్, కేజీబీవీ ఎస్ఒ శ్రీలక్ష్మి, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో నిర్మలా దేవి ఉన్నారు.



ఆసుపత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

మంత్రి ఉషశ్రీ చరణ్ పరామర్శ

కెబిబివిలో విద్యార్థినులు అస్వస్థకు గురైన విషయం తెలుసుకున్న స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ స్పందించారు. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అక్కడే ఉన్న తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు.

మంత్రిని అడ్డుకున్న విద్యార్థి సంఘాలు

కెజిబివి భోజన ఏజెన్సీ నిర్లక్ష్యం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, దీనిపై స్పందించి ఏజెన్సీని రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి అనంతపురం ప్రభుత్వాసుపత్రి వద్ద మంత్రి ఉషశ్రీచరణ్‌ను అడ్డుకుని నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్రయాదవ్, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర తదితరులు మంత్రిని అడ్డుకుని సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఘటనకు కారణమైన ఏజెన్సీని రద్దు చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కెజిబివి సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ,ఎస్సీ, మైనారిటీ విద్యార్థి నాయకులు సురేష్, ఏపీఎస్ఎఫ్ నాయకులు రవికిరణ్, కమల్ పాల్గొన్నారు.



ఎదురీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

'ఎదురీత' నేర్పుతుంది..!

సిఐటియు జిల్లా నాయకులు వి.రాంభూపాల్

ఉన్నం వెంకటేశ్వర్లు 'ఎదురీత'పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

తాను నమ్మిన సిద్ధాంతం కోసం అనేక అవరోధాలు, ఆటంకాలు ఎదురైనా ఏరకంగా ఎదురీత చేయవచ్చునో తెలిపే పుస్తకమే 'ఎదురీత' అని సిఐటియు జిల్లా నాయకులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఉన్నం వెంకటేశ్వర్లు రచించిన 'ఎదురీత' పుస్తకాన్ని శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఇందులో సిఐటియు, ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం, కెవిపిఎస్, అంగన్‌వాడీ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఎదురీత పుస్తక రచయిత ఉన్నం వెంకటేశ్వర్లు చిన్నతనం నుంచి పోలియోతో వైకల్యం పొందినా ఎక్కడా వెరవకుండా ప్రజా సమస్యల కోసం పోరాటం సాగించారన్న విషయాలను తెలియజేసే ప్రయత్నం చేసారని పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమాలను చిన్న తనంలోనే రూపొందించేందుకు ఏ రకంగా పనిచేసారో వివరించారన్నారు. అంతటితోనే ఆగకుండా వామపక్ష పత్రికకు సంబంధించిన జర్నలిజం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ అనేక మందికి ప్రజా జర్నలిజం పాఠాలను నేర్పడమే కాకుండా, ప్రజా దృష్టిలో ఉంచి వార్తలను ఏ రకంగా రాయాలనే విషయాలను నేర్పించారని తెలిపారు. ఇప్పుడు అనేక మంది ఇతర పత్రికల్లోనూ ఈయన వద్ద శిక్షణ పొందిన పాత్రికేయులు పాత్రికేయరంగంలో రాణిస్తున్నారన్నారు. వయోభారం, వైకల్యం వెన్నాడుతున్నా ఆయన ఇప్పటికీ ప్రజా సమస్యలు, పోరాటాల గురించి ఆలోచిస్తూనే ఉంటారన్నారు. ఒక వ్యక్తి గట్టిగా సంకల్పిస్తే ఎన్ని ఇబ్బందులున్నా ప్రజల కోసం పనిచేయొవచ్చునో తెలియజేసే విధంగా ఆయన జీవితం ఉంటుందన్నారు. ఇలాంటి వారిని చూసి ప్రజా సంఘాల్లో పనిచేసే వారు కూడా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాగమణి, నాగేంద్రకుమార్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజినేయులు, కృష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెవిపిఎస్ నాయకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే బీసీలకు పెద్దపీట

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే బిసిలకు పెద్దపీట వేస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో రాయలసీమ గర్జన కరపత్రాలు, బీసీ మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా కర్నూలులో న్యాయ రాజధానిగా హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 5న ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా డిసెంబర్ 7న విజయవాడ లోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న జయహో బీసీ మహాసభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున బీసీలు, నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఎం జగన్ ఎన్నికలకు ముందే ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి, అధికారంలోకి వచ్చాక క్యాబినెట్‌లో బీసీలకు పెద్దపీట వేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానాన్ని బీసీలకు కట్టబెట్టినట్లు తెలిపారు. అంతేకాక 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి బీసీలకు ఉన్నత స్థాయిని కల్పించారన్నారు. బీసీలు అంటే వెనుకబడిన వారు కాదని (బ్యాక్‌బోన్) వెన్నుముక లాంటి వారన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.టి సిద్ధప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఐ.శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ ముస్తాక్, గుమ్మగట్ట మండల కన్వీనర్ మంజునాథ, వార్డు సభ్యులు డిష్ గోవిందా షబ్బీర్, ఫక్రుద్దీన్, నాయకులు కాంతారెడ్డి, పొరాలు శివ, గోరంట్ల సత్తి, తదితరులు పాల్గొన్నారు.



జయహో బిసి మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

'ఇదేం ఖర్మ'ను విజయవంతం చేయండి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పాలనపై ప్రశ్నించడానికి టిడిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఇందుకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, అవలంభిస్తున్న తీరును ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం

రాయదుర్గం రూరల్ : వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఆవిర్భావ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మల్లాపురంలో విఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్టీ సాధన కోసం వాల్మీకులు ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో విఆర్‌పిఎస్ పాత్ర కీలకమన్నారు. రాబోయే రోజుల్లో అగ్ర నాయకత్వం సూచన మేరకు ఎస్టీ సాధన కోసం పోరాడేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, సిద్ధప్ప, రఘు, సోమశేఖర్, మల్లాపురం యువత పాల్గొన్నారు.



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న తహాశీల్దారు

జగనన్న కాలనీల పరిశీలన

బుక్కరాయసముద్రం : మండలంలోని దయ్యాలకుంటపల్లి, బయన్నపేట గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహాలను తహాశీల్దారు మోహన్ కుమార్ ఎంపీడీవో తేజోత్న్స, ఎంపీటీసీ వెంకటశివారెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ప్రతి లబ్ధిదారుడికీ ఇంటిని నిర్మించి ఇవ్వాల్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కాలనీల్లో విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించాలని, కొండపై నుంచి వర్షం నీరు రాకుండా ట్రెంచ్ ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి అమర్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుత్తి : మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన గద్దల దేవేంద్రప్పకు శనివారం వైవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేద కుటుంబానికి చెందిన దేవేంద్రప్ప ఎస్ఐ పోస్ట్‌కు శిక్షణ తీసుకుంటుండగా వైవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ఎమ్మెల్యే సమకూర్చిన రూ.25 వేలును వైసిపి మండల ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, గద్దల రంగస్వామి, నక్కా ఆంజనేయులు, రంగనాయకులు పాల్గొన్నారు.

మెటీరియల్ వితరణ

బెలుగుప్ప : హైదరాబాదుకు చెందిన గ్రీన్ కో-ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువజేసే టేబుళ్లు, కుర్చీలు, పుస్తకాలు తగ్గుపర్తి గ్రంథాలయానికి గురువారం అందజేశారు. ముఖ్య అతిథులు ఎస్.రామేశ్వరరావు, వేణుప్రసాద్, మేనేజర్ సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై వాటిని వితరణ చేశారు. అనంతరం గ్రీన్ కో-ఫౌండేషన్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మౌనిక డివెంకట నాయుడు, గ్రంథాలయ అధికారి పురుషోత్తమ నాయుడు, బ్యాంక్ అధికారి శివరాజగోపాల్, మల్లికార్జున, వెంకటేశులు, ఉపాధ్యాయులు రాజశేఖర్, రామచంద్ర, నాగమణి తదితరులు పాల్గొన్నారు

మహాసభల పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-నార్పల

జగ్గారెడ్డిగూడెంలో ఈనెల 8వ తేదీ జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సిపిఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప, నాయకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో స్థానిక దుగుమర్రి రోడ్డులో శనివారం ఆవిష్కరించారు. మండలం నుంచి కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూరి, బాషా, ప్రభాకర్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వి(చి)త్తశుద్ధి ఉందా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా రైతాంగానికి కష్టాలు తప్పడం లేదు. అప్పుడు వర్షాల్లేక పంటలు సరిగా పండలేదు...ఇప్పుడు వర్షాలు వచ్చి పంట చేతికందకుండాపోతోంది. అధిక వర్షాలతో చీడపీడలు రైతాంగాన్ని చుట్టుముడుతున్నాయి. వేరుశనగ కాదని కొంత వరకు పత్తి పంట వైపు మొగ్గుచూపారు. 54 శాతం అధికంగా పత్తిపంట సాగైంది. సుమారు ఒకటిన్నర లక్షల ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.50 వేల వరకు ఖర్చు పెట్టారు. తీరా ఇప్పుడు పంట దిగుబడిచూస్తే ఏ మాత్రం లేకుండాపోతోంది. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు దిగాలు చెందుతుతున్నారు. ఈ పంట నష్ట పరిశీలనకు వ్యవసాయ శాస్త్రవేత్తలను సైతం పంపించింది. వారు పరిశీలించారు. ప్రధానంగా అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయని నివేదికలిచ్చారు. కొంత విత్తన నాణ్యతలోనూ లోపాలున్నట్టు గుర్తించినప్పటికీ ధ్రువీకరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇది ధ్రువీకరించడానికి విత్తన పంపిణీలో లోపాలే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్‌లో పత్తి విత్తనాలను నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది డీలర్లు రైతులకు అంటగట్టారు. తెలంగాణాలోని బూత్‌పూర్ నుంచి తీసుకొచ్చి రైతులకు అందజేశారు. వీటికి సంబంధించి బిల్లులు కూడా రైతులకు ఇవ్వలేదు. పంట బాగుంటుందని పెట్టిన రైతులకు ఇప్పుడు పంట ఏ మాత్రం దక్కే పరిస్థితి లేదు. దీంతో పంట నష్టపోయిన రైతుల వద్ద బిల్లులు లేవన్న పేరుతో పంట నష్టం రావడం కూడా సందేహాస్పదంగానే మారుతోంది. దీనికి బీమాను వర్తింపజేస్తారా లేదా అన్న సందేహాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి. దీనిపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు జరిపింది. 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా సైతం నిర్వహించేందుకు పిలుపునిచ్చింది. ఇక ఇతర పంటలకు చీడపీడలు వెంటాడుతూనే ఉన్నాయి. మిరప నల్లి తెగులు భయపెడుతోంది. దీని నివారణ కోసం రైతులు పురుగుల మందులు పెద్ద ఎత్తున ఈ ఏడాది వినియోగిస్తున్నారు. అరటికి సిగటోమా పట్టుకుంది. పంట చేతికొచ్చాక వస్తున్న ఈ సిగటోమా వల్ల వ్యాపారులు పంటను కొనేందుకు ముందుకు రావడం లేదు. దీని నుంచి రక్షించుకునేందుకు పురుగుల మందులు వాడుతున్నారు. ఈ రకంగా అనధికారిక అంచనా ప్రకారమే ఈ ఏడాది పురుగుల మందుల వ్యాపారం మూడొంతులు పెరిగిందని చెబుతున్నారు. ఎప్పుడూలేని విధంగా వర్షాలొచ్చి బయటకు అంతా పచ్చిగా



కనిపిస్తున్నా...లోన పురుగు తొలిచేస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టపోతున్న రైతాంగానికి ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందన్న దానిపై అధికారిక ప్రకటనేదీ ప్రభుత్వం చేయలేదు. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకులు మాత్రం పోటాపోటీగా ఇతర అంశాలపై విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు సవాల్లు విసురుకుంటున్నారు. అసలైన సమస్యలపై ఏ మాత్రం చర్చ జరగడం లేదు. రాప్తాడు నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల నాయకులు ఈ వారంలోనూ పెద్దఎత్తున ఆరోపణలు చేసుకోవడమే కాకుండా పరస్పరం ఎస్పీకి ఫిర్యాదులు సైతం చేసుకున్నారు.

ఫుడ్ ఏజెన్సీలను రద్దుచేయాలి

అధికారులపై చర్యలు తీసుకోవాలి



మంత్రితో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శింగనమల కేజీవీపీ పాఠశాలలో కలుషిత ఆహారం తిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 84 మంది విద్యారులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కెజిబివి అధికారులు, వార్డెన్, స్పెషల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శింగనమల కెజిబివి పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని విద్యార్థి జెఎసి నాయకులు వెళ్లి పరామర్శించారు. అక్కడకు వచ్చిన రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్‌ను బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర నాయకులు ఆకుల రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బిసి.సురేష్, జనసేన నాయకులు భవానీ రవికుమార్ మాట్లాడుతూ నాసిరకం సరుకులు, కుళ్లిపోయిన కాయగూరలు, ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన చిక్కీలు, స్నాక్స్ అందిస్తున్నారని తెలిపారు. ఆ ఏజెన్సీలు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నో సార్లు జిల్లా విద్యా శాఖ అధికారులకు ఎస్ఎస్ఎ వినతిపత్రాల ద్వారా ధర్నాల ద్వారా తెలియజేసినా ఏమాత్రం పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని నాణ్యమైన సరుకులు, కూరగాయలు, స్నాక్స్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ఎఫ్ నాయకులు రవికిరణ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలను ప్రభుత్వమే సరఫరా చేయాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

అనంతపురం కలెక్టరేట్ : పాఠశాల విద్యార్థులకు పరీక్ష ఫార్మాటివ్ అసిస్‌మెంట్ పరీక్షలకు ప్రశ్నాపత్రాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థులకు ప్రశ్నావళి ప్రభుత్వం నుంచి డిఇఒలు, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డిసిఇబి) ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులకు వాట్సప్‌ల ద్వారా పంపుతున్నారు. వాటిని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంఇఒలు పంపుతున్నారు. ప్రశ్నలు బోర్డుపై రాసిన తరువాత విద్యార్థులు రాసుకోవాల్సి వస్తోంది. బొమ్మలు కూడా బోర్డుపైనే ఉపాధ్యాయులు గీయాలి. ఆ బొమ్మలను విద్యార్థులు మళ్లీ సమాధాన పత్రాల్లో గీసుకోవాల్సి వస్తోంది. బోర్డు మీద రాయడం విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో మాదిరిగా ప్రశ్నాపత్రాలను నేరుగా పాఠశాలలకు సరఫరా చేస్తే ఇలాంటి సమస్యలు ఉండవన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'ఇదేం ఖర్మ.. రాష్ట్రానికి' జనం ఆదరణ

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ప్రజల నుంచి విస్తృత ఆదరణ లభించింది. టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో నగరంలోని 6వ డివిజన్ నీరుగంటి వీధి, వేణుగోపాల్ నగర్, తదితర ప్రాంతాల్లో కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు టిడిపి శ్రేణులకు స్వాగతం పలుకుతూ వారి సమస్యలు తెలిపి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడున్నర సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వైఫల్యాలను ఎండగడుతూ ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, దేవర్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర నాయకులు కూచి హరి, గుర్రం నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

విభిన్న ప్రతిభావంతులు సైతం అన్ని రంగాల్లోని రాణిస్తుండటం అభినందనీయమని నగర మేయర్ మొహమ్మద్ వసీం కొనియాడారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని శనివారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ వసీం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల శక్తి సామర్థ్యాలు అద్వితీయమన్నారు. వైకల్యం శరీరానికే కాని మనసుకు కాదనే ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్న వారే విభిన్న ప్రతిభావంతులని పేర్కొన్నారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి సైతం అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని వాటిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. క్రీడా పోటీలలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు మేయర్ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు, ప్రముఖులు, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శింగనమల : స్థానిక రామాలయం దగ్గర అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని తరిమెల నారాయణ అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, వెలుగు సిసి రంగప్ప, ఆర్డీటీ జీవో వీరాంజనేయులు హాజరయ్యారు. వికలాంగులు వారికి కల్పించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, తులసి, రాజేష్, యశోద, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, శిరీష, మసూద్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక ఆరోగ్య కేంద్రం నందు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ నరసింహారెడ్డి హాజరయ్యారు. వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం వికలాంగుల కోసం ఎన్నో సదుపాయాలు కల్పించిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచి వరలక్ష్మి మాట్లాడుతూ వికలాంగులకు రూ.3 వేలు పింఛను పెంచిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్తిబాబు, హెచ్‌ఎం గంగిరెడ్డి, షరీఫా అరుణ్ కుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

5న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో పత్తిపంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు విటి.రామాంజినేయులు, నల్లప్ప, సుంకన్న, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాసులు, నాగభూషణ, రాము, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సమాజం'లో యువత భాగస్వామ్యం కావాలి

ప్రిన్సిపాల్ పి.గోపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

స్వచ్ఛ సమాజంలో యువత భాగస్వామ్యం కావాలని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపాల్ అన్నారు. శనివారం స్థానిక కసాపురం రోడ్డులోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో క్లీన్ ఇండియా ప్రోగ్రాం లో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు పరిశుభ్రత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువుతోపాటు పరిసరాలపై అవగాహన, పరిశుభ్రత అవసరమన్నారు. పరిశుభ్రత అందరి బాధ్యత కావాలని, విద్యార్థులు సామాజిక సేవను దృఢ సంకల్పంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల చుట్టుపక్కల ఉన్న పరిసరాలను శుభ్రం చేసి కలుపు మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.కృష్ణయ్య, సైన్స్ కోఆర్డినేటర్, సీనియర్ అధ్యాపకులు రేగుల సురేష్‌బాబు, అధ్యాపకులు చంద్రశేఖర్, చంద్ర, నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఏ నారాయణపురం లోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్లను ప్రతి ఇంటికీ అందజేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం తమదని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పిటిసి చంద్రశేఖర్, ఎంపిటిసిలు నాగేంద్ర, శృతి, వైసీపీ నాయకులు ఉమ్మడి మదన్మోహన్‌రెడ్డి, జగన్మోహన్, వేణు, బి.మదన్‌మోహన్, పురుషోత్తమరెడ్డి, హాజీవలి, పెద్ద లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సభా ప్రాంగణ నిర్మాణం

ఉరవకొండ : ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభా ప్రాంగణాన్ని నిర్మించడానికి పూర్వ విద్యార్థి పి.సమీర్ కుమార్ కళాశాల ప్రిన్సిపల్ మమతకు రూ.10 లక్షలు అందజేశారు. తండ్రి పెనకలపాటి ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నిర్మించిన ప్రాంగణాన్ని ప్రిన్సిపల్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మమత మాట్లాడుతూ సమీర్‌కుమార్ కృషి, పట్టుదలను చూసి విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఆకాంక్షించారు. అనంతరం సమీర్‌కుమార్ మాట్లాడుతూ చదివిన స్కూలుకి, కాలేజీకి తమ ప్రాంతానికి తన సంపాదనలో ఎంతో కొంత సహాయం చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సమీర్ కుమార్‌ను కళాశాల ప్రిన్సిపల్ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమీర్‌కుమార్ బంధువులు, కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కమిటీ సభ్యునికి సన్మానం

డి.హీరేహాల్ : రాయదుర్గం మార్కెట్ యార్డు కమిటీ సభ్యునిగా ఎంపికైన హనుమంతరెడ్డిని వైసిపి నాయకులు, మైనారిటీ సంఘం అధ్యక్షులు రహంతుల్లా శనివారం సన్మానించి అభినందనలు తెలిపారు. రాయదుర్గం మార్కెట్ యార్డ్ 12వ నూతన పాలకవర్గం శుక్రవారం కొలువుదీరింది. ఈ కమిటీలో సభ్యునిగా ఎంపికైన డి.హీరేహాల్ గ్రామానికి చెందిన హనుమంతరెడ్డిని ఆయన నివాసంలో నాయకులు పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు రహంతుల్లా మాట్లాడుతూ తన సోదర సమానమైన హనుమంతరెడ్డి కమిటీ సభ్యునిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివారెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో కార్మికుల నిరసన

అనంతపురం : దీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎంఎల్ డిపో కార్మికులు నిరసన తెలిపారు. శనివారం డిపో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా హమాలీ యూనియన్ జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎగుమతి కూలి రేట్లు పెంచాలని అనేక సార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపచేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మన్నీల రామాంజనేయులు, బాలరంగయ్య, జెఎసి నాయకులు తిరుపాలు, మోహన్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ లింగప్పకు సన్మానం

బెలుగుప్ప : బెలుగుప్ప మండల కేంద్రానికి చెందిన వాలంటీర్ లింగప్ప సేవలను గుర్తించి ఆపదమిత్ర వాలంటీర్‌గా జిల్లాలో నాలుగో వ్యక్తిగా గుర్తించి అధికారులు మెమెంటో అందజేశారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న వైసిపి నాయకుల సమక్షంలో లింగప్పకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్ లింగప్ప ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని సేవలు అందించి మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివలింగప్ప, కన్వీనర్ శ్రీనివాసులు, కరుణాకర్, పురుషోత్తం, పాతన్న, నరుగన్న, ఎంపీటీసీ ఈశ్వరప్ప, హనుమంతరాయుడు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు ఆకస్మిక మృతి

ఆత్మకూరు : మరో వారం రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు అకస్మాత్తుగా మృతి చెందాడు. ఈ ఘటన అనంతపురం నగరంలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆత్మకూరు మండలం పాంపల్లి గ్రామానికి చెందిన నాగవర్ధన(24) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ప్రతి రోజూ అనంతపురానికి వెళ్లి అక్కడ పనులు చేస్తుండేవాడు. ఈయనకు ఇటీవల వివాహం నిశ్చయం అయ్యింది. మరో వారం రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా పెళ్లి పనులు చూసుకుంటూ ఉన్నాడు. శనివారం ఉదయం ఓ పనిమిత్తం అనంతపురం వెళ్లాడు. శ్రీకంఠం సర్కిల్ ఆటో స్టాండ్ వద్ద నిల్చొన్న యువకుడు అకస్మాత్తుగా కిందపడ్డాడు. వెంటనే స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

92 ఏళ్ల వృద్ధురాలికి స్టెంట్ అమరిక

సంక్లిష్టమైన కేసులో కిమ్స్ వైద్యుల విజయం

అనంతపురం : ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 92 ఏళ్ల వృద్ధురాలికి అనంతపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు కేవలం 10 నిమిషాల వ్యవధిలో అత్యవసరంగా స్టెంట్ అమర్చి ఆమెను ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ వివరాల మేరకు.. అనంతపురం జిల్లా పాపంపేట ప్రాంతానికి చెందిన 92 ఏళ్ల వృద్ధురాలు మూడు రోజుల క్రితం తీవ్రమైన ఆయాసం, గుండెనొప్పితో కిమ్స్ సవీరా ఆసుపత్రికి వచ్చారు. పరీక్షలు చేయగా ఆమెకు తీవ్రమైన గుండెపోటు వచ్చిందని తెలిసింది. యాంజియోగ్రామ్ చేయగా ఎడమవైపు రక్తనాళం 100% మూసుకుపోయింది. దీంతో ఐదు నిమిషాల వ్యవధిలోనే ఆమెకు స్టెంట్ అమర్చారు. దాంతో రెండు రోజుల తర్వాత గుండె పంపింగ్ పెరిగి, రోగి ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడ్డారు. 90 ఏళ్ల దాటినవాళ్లకు ఇలా స్టెంట్ వేయడం ఏపీలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 88 ఏళ్లవారికి అమర్చారు.

పారిశ్రామిక వేత్తలను పొగపెట్టి పంపుతున్నారు..

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేవరగుడి జగదీష్

గుంతకల్లు : గత టిడిపి హయాంలో రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు ఎర్రతివాచి వేస్తే ప్రస్తుత సిఎం జగన్‌రెడ్డి కమీషన్లకు కక్కుర్తిపడి వారికి పొగపెట్టి తరిమివేస్తున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ విమర్శించారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని బిటి.పక్కీరప్ప భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా పోవడానికి, ఉన్నవి తరలి వెళ్లడానికి సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వమే కారణమన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలను ఖండించాలని ప్రచార గోడపత్రికలను విడుదల చేశారు. సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ నాయకులు మహేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాత్రికా ఫెర్టిలిటీ సెంటర్ తనిఖీ

అనంతపురం : ఎఆర్‌టి, సరోగసి చికిత్సను అందించేందుకు దరఖాస్తు చేసుకున్న మాత్రికా ఫెర్టిలిటీ సెంటర్, ఎంఎన్ఆర్ నర్సింగ్ హోమ్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్, గైనకాలజిస్టు మాణిక్యరావు, పెథాలజిస్ట్ శ్రీనివాస్, రేడియాలజిస్టు మనోరంజన్ రెడ్డి, రెడ్స్ భానుజా శనివారం తనిఖీ చేశారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రుల్లో సదుపాయాలు అందుబాటులో ఉన్నాయోలేదో తనిఖీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన

గుత్తి : పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహాశీల్దార్ ఎస్.మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ బివి.నరసారెడ్డి శనివారం పరిశీలించారు. శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పవిత్ర, నాగరత్న, రంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్‌కెపిలో ఘంటసాల సంగీతవిభావరి

అనంతపురం : స్థానిక లలిత కళాపరిషత్‌లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఘంటసాల సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్‌కెపి అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి జి.పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు..సంగీత ప్రియులు, కళాకారులు జయప్రదం చేయాలని కోరారు. .

ప్రీ పీహెచ్‌డీ వింటర్ పరీక్షల కేంద్రం తనిఖీ

అనంతపురం : అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రీ పిహెచ్‌డి వింటర్ షెసన్ పరీక్షల కేంద్రాన్ని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన శనివారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహన ఎలా జరుగుతున్నదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష హాలును తిరిగి పరిశీలించి కళాశాల అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆచార్య వి.సుమలత, ఆచార్య ఇ.కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భవాని, డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ ఎస్.చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ జితేంద్ర గౌడ్, డాక్టర్ జె.శ్రీనివాసులు, డాక్టర్ ఎం.అంకారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ లెప్రసీ తనిఖీ విభాగం డాక్టర్ హసన్న, జిల్లా లేప్రసీ కేంద్రం డాక్టర్ అన్వర్, డిప్యూటీ ప్యారా మెడికల్ ఆఫీసర్ బాలఓబులు శనివారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ కుమార్, నోడల్ ఆఫీసర్ చిన్న కంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సరైన మార్గాన్ని ఎంచుకుని సాధన చేయాలి

బుక్కరాయసముద్రం : పోటీ ప్రపంచంలో ఉన్నతంగా ఎదగాలనే యువత సరైన మార్గాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగా సాధన చేయాలని బుక్కరాయసముద్రం జెడ్పిటిసి నీలం భాస్కర్ అన్నారు. అనంతపురం నగరంలోని సాయినగర్, 3వ రోడ్డు నందు నూతనంగా ప్రారంభించిన ఆర్యన్ పోటీ పరీక్షల శిక్షణ అకాడమీ వారి కరపత్రాలను ఆయన శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎపి ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ప్రత్యేక రాయితీతో శిక్షణ అందించాలని కోరారు. అకాడమీ వారు స్పందిస్తూ శింగనమల నియోజకవర్గం నుంచి శిక్షణ కోసం వచ్చే నిరుద్యోగ యువతకు ప్రత్యేక రాయితీతో అత్యుత్తమ శిక్షణ అందిస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి వివరాల కోసం 9063020020 నెంబరును సంప్రదించాలని కోరారు.

దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు

ఉరవకొండ : నియోజక వర్గంలో నూతనంగా నిర్మించనున్న మూడు దేవాలయాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుల ద్వారా ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షలు చొప్పున రూ.30 లక్షలు నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉరవకొండ మండలం వ్యాసాపురం గ్రామంలోని సుంకులాంబ దేవాలయం, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి, కొనకొండ్ల గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణం కోసం నిధులు విడుదల అయ్యాయని చెప్పారు.





మీకోసం

ఒక గ్లాసు గోరువెచ్చటి నీటిలో కొద్దిగా పటిక బెల్లం, నిమ్మరసం కలిపి తాగితే కఫం కరిగిపోయి పొడిదగ్గు తగ్గుతుంది.

జీవన సౌరభం

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమే.. కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతం.

అహం పనికిరాదు



ఒక అడవిలో తెల్ల పక్షులు, నల్ల పక్షుల సమూహాలు జీవిస్తున్నాయి. తెల్ల పక్షులు చాలా గర్వంగా ఉండేవి. ఆ జట్టు నాయకుడు నల్ల పక్షులు కనిపించిన ప్రతిసారీ హేళన చేస్తూ ఉండేవారు.

'ఈ సృష్టిలో అందమంతా మా సొంతం. మీరు నల్లగా, పొడవైన గోళ్ళతో, వాడిగల ముక్కుతో చూడటానికే అసహ్యంగా కనిపిస్తున్నాయి. అందువల్ల మా జాతి ఈ భూప్రపంచంలోనే గొప్ప' అని బీరాలు పలికాడు.


'అందమనేది శాశ్వతం కాదు. కొంతకాలానికి అది నశిస్తుంది. మనం చేసిన మంచి పనులే శాశ్వతం' అని నల్ల పక్షుల జట్టు నాయకుడు తోటి పక్షులకు చెప్పి ధైర్యాన్నిస్తూ ఉండేవారు.

ఒక రోజు తెల్ల పక్షుల జట్టు నాయకుడు నేలపై నడుస్తూ కేరింతలు కొడుతూ మైమరచి నృత్యం చేయసాగాడు. దాన్ని చూసిన మిగిలిన పక్షులూ నేల మీద దిగి గంతులేయసాగాయి. అక్కడ వేటగాళ్ళు పెట్టిన సన్నని వలలను ఆ పక్షులు గమనించకపోవడం వల్ల వాటి కాళ్ళు అందులో ఇరుక్కుపోయాయి.

ఆ రోజు వర్షం కురవడం వల్ల వేటగాళ్ళు రాలేదు. ఒకరోజల్లా ఆకలితో బిక్కుబిక్కుమని నిలువుకాళ్ళపై నిలబడ్డాయి. మరుసటిరోజు ఉదయాన్నే నల్ల పక్షులు అక్కడికి వచ్చి తమ బలమైన గోళ్ళతో రక్కి, ముక్కుతో కొరికి బంధవిముక్తుల్ని చేశాయి. ఆ తరువాత తమతో తెచ్చిన ఆహారాన్ని వాటికి తినిపించాయి.

అప్పుడు నల్ల పక్షుల నాయకుడు 'తెల్లగా ఉన్నంత మాత్రాన ఏ జాతి గొప్ప కాదు మిత్రమా! ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న జాతి, ఆకలిగొన్నవారికి పట్టెడు మెతుకులు పెట్టే జాతి, తోటివారిని హేళన చేయకుండా వారి మనోభావాలను గౌరవించే జాతి, ఇతరుల కష్టాన్ని గుర్తించే జాతి గొప్పది' అని హితవు పలికాడు. ఆ రోజు నుంచి తెల్ల పక్షులు అన్ని జాతుల పక్షులతో స్నేహంగా మెలగసాగాయి.

- షేక్ అబ్దుల్ హాకీం జాని
99494 29827



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 169

నేను గీసిన బొమ్మ



- గుర్రం హాసిని,
8వ తరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మన నైటింగేల్



స్టాఫ్ నర్సుగా ఝాన్సీరాణి తన వృత్తి పట్ల గౌరవం, నిబద్ధతే తనను ఈ స్థాయికి తీసుకు వచ్చాయి. వైద్యసేవల్లో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులు తెలుసుకుంటూ వృత్తిలో నైపుణ్యం సాధించారు. అత్యవసర వేళల్లో అంకితభావంతో పనివేళలతో సంబంధం లేకుండా సేవలు అందిస్తు న్నారు. కోవిడ్ సమయంలో భర్త చనిపోయినా ఆ బాధను భరిస్తూనే రోగులకు ధైర్యాన్నిచ్చారు. ఇప్పుడు కూడా అర్ధరాత్రయినా సిబ్బందికి, రోగులకు ఫోన్లో స్పందిస్తూ సూచనలు ఇస్తారు. ఎంతోమందికి రక్తదానం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. అందుకు గానూ ఆమెను 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు-2021' వరించింది.

విజయవాడలో అయోధ్యనగర్‌కు చెందిన ఝాన్సీరాణి ఉద్యోగ కుటుంబానికి చెందిన వారు. తల్లి దేవి కృపామణి గృహిణి. తండ్రి ఆనంద పిళ్లై రైల్వే లోకో పైలెట్. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. రెండో కూతురు ఝాన్సీ. నానమ్మ, ముగ్గురు మేనత్తలు, వారి కుటుంబసభ్యులు, పిల్లలు అంతా కలిసే ఉండేవారు. బాల్యం నుంచీ ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నారు. దాంతో కుటుంబంలో ఏ సమస్య వచ్చినా, ఏ ఒక్కరూ అనారోగ్యానికి గురైనా, వృత్తి రీత్యా ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా ఒకరికొకరు తోడు నిలుస్తూ, సహకారం అందించుకుంటూ ఉండేవారు.

ఇటువంటి వాతావరణంలో పెరిగిన ఆమె ఇతరుల పట్ల సేవాగుణాన్ని అలవరుచుకున్నారు. చదువులోనూ, ఆటల్లోనూ ఎంతో చురుకుగ్గా ఉండేవారు. రైల్వేజోన్‌లో జరిగే కల్చరల్, క్రీడ విభాగాల్లో పాల్గొని ఎన్నో బహుమతులు సాధించారు. అక్క ప్రసన్నలక్ష్మి సూచన మేరకు ఇంటర్ తర్వాత బిఎస్సీ నర్సింగ్‌లో చేరారు. అమెరికన్ సెంటాన్స్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో పీబీ బీఎస్సీ(ఎన్) కోర్సు చేశారు. పాఠాలను ఎలా గుర్తుపెట్టుకోవాలి, ల్యాబ్ పరీక్షలు ఎలా చేయాలి, వృత్తి పట్ల ఎలా మసులుకోవాలి వంటి విషయాలను అక్క ఎప్పటికప్పుడు గైడ్ చేస్తూండేవారు. చదువు అయిన వెంటనే వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్శిటీ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివ నాగేశ్వరరావును ఇంట్లో పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. విజయవాడ జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూనే ఇన్‌సర్వీస్ ఎడ్యుకేషన్ కింద భర్త ప్రోత్సాహంతో ఆమె చదువు కొనసాగించారు. బెంగుళూరు, చెన్నై నగరాల్లో మూడు, నాలుగు నెలల పాటు శిక్షణ తీసుకుని వృత్తిలో 13 సర్టిఫికేట్లు సాధించారు.

ఆయనే అన్నీ భరించారు

'ఉన్నత స్థాయిలో ఉన్న ఆడవాళ్లు సైతం పిల్లల్ని, కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. నేను అలా కాదు. పిల్లల్ని మాత్రమే నేను కన్నాను. పెంచింది మాత్రం ఆయనే. నేను చేసే వృత్తి చాలా గొప్పదని ఆయన ఎప్పటికీ భావించేవారు. అందుకే పిల్లల్ని పుట్టిన కొన్ని నెలలకే ఉద్యోగంలో చేరాను. అప్పటి నుంచి వాళ్ల అవసరాలు, చదువులు, ఉద్యోగంలో స్థిరపడే వరకూ అన్నీ ఆయనే బాధ్యతవహించారు. నన్నూ అలాగే చూసుకున్నారు. ఆయన ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూనే, ప్రతిరోజూ వంటచేసి, బాక్సు కట్టి, హాస్పటల్లో దించేవారు. నా డ్యూటీ అయిన వెంటనే వచ్చి తీసుకెళ్లేవారు. ఏ సమయంలోనైనా నా వెన్నంటే ఉన్నారు. పిల్లలకు నేను లేని లోటు తీర్చారు. దాంతో ఎటువంటి ఇబ్బందులూ, ఒత్తిడి లేకుండా వృత్తిలో క్రమశిక్షణతో విధులు నిర్వహించగలిగాను.' అని అంటారు ఝాన్సీ.

కీలక సమయాల్లోనూ...

విజయవాడ ఆసుపత్రిలో 25 ఏళ్ల ఐసీయూ, ట్రామా, ఎమర్జింగ్, న్యూరో, బర్న్స్, లెప్రసీ, ఆంకాలజీ, బ్లడ్ బ్యాంకు, దిశా కౌన్సిలింగ్ సెంటర్...ఇలా అన్ని విభాగాల్లోనూ బాధ్యతలు నిర్వహించారు ఆమె. ఇంటి దగ్గర ఎన్ని పనులున్నా కాదనకుండా అవసరాన్నిబట్టి మూడు షిఫ్ట్‌ల్లోనూ పనిచేసేవారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు సిఎం కాన్వాయ్‌లో అంబెలెన్సులోనూ ఝాన్సీ విధులు నిర్వహించారు. ఒకసారి ఆయన ఎకోస్ప్రిన్ టాబ్లెట్, మందులు అడిగారు. అవి డాక్టర్ల దగ్గర లేదు. ఆ విషయం చెప్పడానికి అందరూ భయపడుతున్నారు. వెంటనే ఝాన్సీ సమయస్ఫూర్తితో వ్యవహరించారు. ఆ మందులను విజయవాడ ఆసుపత్రి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టు సిబ్బంది ద్వారా వెంటనే తెప్పించి ఇచ్చారు. ఒకసారి బ్లడ్ బ్యాంకుకు ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వచ్చారు. రక్తం తీసిన వెంటనే కళ్లు తిరిగి పడిపోయారు. అతని తల పగలి రక్తం కారింది. చికిత్స చేసే డాక్టర్ అందుబాటులో లేకపోవడతో ఆమె దగ్గరుండి వైద్యం చేశారు. మరో ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లి, తల స్కానింగ్ చేయించి ఏ ప్రమాదమూ లేదని నిర్ధారించిన తర్వాత వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పలువురు గర్భిణీలకు కాన్పు సమయంలో ధైర్యం చెప్పి, ఆపరేషన్ అయ్యే పరిస్థితి నుంచి మామూలు కాన్పు అయ్యేలా చేశారు. కొత్తగా వచ్చిన డాక్టర్లను, తోటి సిబ్బందికీ తల్లో నాలుకలా ఉండేవారు. ఇతర ప్రాంత్రాల్లో నిర్వహించే క్యాంపుల్లో వైద్యుల వెంట కీలక పాత్ర పోషించి 34 ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో జరిగే కల్చరల్, క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులూ సొంతం చేసుకున్నారు.





భర్త, అక్క చనిపోయినా

తన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన అక్క ప్రసన్న లక్ష్మి, భర్త శివనాగేశ్వరావు ఫస్ట్ కోవిడ్ సమయంలో వైరస్ బారినపడ్డారు. పరిస్థితి విషమించి వెంటిలేటర్‌పై ఉంచారు. ఝాన్సీ ఏడుస్తూనే దగ్గరుండి వైద్యసేవలు చేశారు. తనను ఎంతగానో ప్రేమించిన వ్యక్తి తన చేతుల్లోనే తుదిశ్వాస విడవడంతో కృంగిపోయారు. తరువాతి వారం రోజుల్లో అక్కా చనిపోయారు. ఇంట్లో తీవ్ర విషాదం... మనసులో ఆ బాధను భరిస్తూనే ఆమె విధులు నిర్వర్తించి తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలిచారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది మొత్తం భయపడిపోయారు. ఝాన్సీ మాత్రం అందరికీ ధైర్యం చెబుతూ, రోగులకు సేవలందించారు. ఆమె సేవలు, ప్రతిభను గుర్తించి విదేశాల్లోనూ అవకాశాలు వచ్చినా విజయవాడ ఆసుపత్రికి ప్రాధాన్యత ఇచ్చి ఇక్కడే ఉన్నారు.

'టీంలో ఒకరికి గుర్తింపు వచ్చిందంటే.. ఆ విజయం ఆ టీం మొత్తానిది. నర్సుగా నేను డ్యూటీలో ఉన్నప్పుడు మాత్రమే రోగికి సపర్యలు చేయగలుగుతాను. కాని ఆ తర్వాత వచ్చిన నర్సులు కూడా జాగ్రత్తగా చూసుకోబట్టే రోగులు త్వరగా కోలుకుని ఇంటికి వెళుతున్నారు. అందుకే ఈ గుర్తింపు అవార్డు మా ఆసుపత్రి వైద్యసిబ్బంది అందరిదీ' అంటారు ఝాన్సీ.

- పద్మావతి



సంక్రాంతికే 'వీర సింహారెడ్డి'

బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వీర సింహారెడ్డి' తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. జనవరి 12న ఈ సినిమా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉంది. గోపీచంద్ మలినేని డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయిక. దునియా విజయ్, వరలక్ష్మి శరత్‌కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.


నేనెంతో గర్విస్తున్నా...



రామ్‌చరణ్‌కి ట్రూ లెజెండ్ అవార్డు రావడం పట్ల చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. 'కంగ్రాట్స్ డియర్ చరణ్. ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియాలో ట్రూ లెజెండ్ అవార్డు నువ్వు అందుకున్నందుకు నేనెంతో గర్విస్తున్నా. నువ్వు ఇలాగే ముందుకు సాగాలని అమ్మా నేను కోరుకుంటున్నాం.' అని చిరు ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కి చరణ్ స్పందిస్తూ.. 'లవ్ యూ అప్పా' అని రిప్లై ఇచ్చారు. ప్రముఖ ఆంగ్ల పత్రికా సంస్థ ఇటీవల వివిధ రంగాల్లో విశేషమైన సేవలను అందించిన పలువురు ప్రముఖులకు ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియా అవార్డులను అందజేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో రామ్‌చరణ్‌కి ట్రూ లెజెండ్ అవార్డు లభించింది. ఈ అవార్డును చరణ్ తన తండ్రి చిరంజీవికి అంకితం చేశారు.

క్వార్టర్స్‌కు నెదర్లాండ్స్

ప్రి క్వార్టర్స్‌లో అమెరికాపై 3-1గోల్స్‌తో గెలుపు



దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 క్వార్టర్‌ఫైనల్లోకి నెదర్లాండ్స్ జట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్ జట్టు 3-1గోల్స్ తేడాతో అమెరికాను ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికే నెదర్లాండ్స్ జట్టు 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్ధభాగం 76వ ని.లో హాజీ రైట్ ఒక గోల్ కొట్టడంతో నెదర్లాండ్స్ ఆధిక్యత 2-1కి తగ్గింది. ఆ తర్వాత నెదర్లాండ్స్ జట్టు డెన్జెల్(81వ ని.) మరో గోల్ కొట్టడంతో నెదర్లాండ్స్ జట్టు తిరుగులేని 3-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్ డిఫెన్స్ ఛేదించడంలో అమెరికాజట్టు విఫలమైంది. దీంతో ఫిఫా ప్రపంచకప్-2022లో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లిన తొలి జట్టుగా నెదర్లాండ్స్ నిలిచింది. తొలి రెండో గోల్స్‌ను మెంఫిస్(10వ ని.), డెలే (45+1వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. అర్జెంటీనా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మరో ప్రి క్వార్టర్స్ మ్యాచ్ విజేతతో నెదర్లాండ్స్ జట్టు క్వార్టర్‌ఫైనల్లో తలపడనుంది.

ప్రి క్వార్టర్‌ఫైనల్స్ షెడ్యూల్..

డిసెంబర్ 4: ఫ్రాన్స్ × పోలండ్(రా.8.30గం॥లకు)
ఇంగ్లండ్ × సెనెగల్(రా.12.30గం॥లకు)
డిసెంబర్ 5: జపాన్ × క్రొయేషియా(రా.8.30గం॥లకు)
బ్రెజిల్ × దక్షిణ కొరియా(రా.12.గం॥లకు)
డిసెంబర్ 6: మొరాకో × స్పెయిన్(రా.8.30గం॥లకు)
పోర్చుగల్ × స్విట్జర్లాండ్(రా.12.30గం॥లకు)

ఓ సంచలనంతో కామరూన్...

గ్రూప్-జిలో కామరూన్ జట్టు పెను సంచలనాన్ని నమోదుచేసింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కామరూన్ జట్టు 5సార్లు ఫిఫా ప్రపంచకప్ ఛాంపియన్ బ్రెజిల్‌ను ఓడించింది. కామరూన్ తరఫున ఏకైక గోల్‌ను విన్సెంట్ 92వ నిమిషంలో చేశాడు. గోల్ కొట్టిన ఆనందంలో విన్సెంట్ అతని జెర్సీని విప్పి సంబరాలు చేసుకోవడంతో అతను రెడ్‌కార్డ్‌కు గురై మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆ తర్వాత బ్రెజిల్ పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ గ్రూప్ నుంచి సెర్బియా, స్విట్జర్లాండ్ జట్లు 6పాయింట్లతో టాప్-2లో నిలిచి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు ప్రవేశించాయి.


బ్రెజిల్‌పై గోల్ కొడుతున్న కామరూన్ ఆటగాడు విన్సెంట్


జెర్సీ తీసేయడంతో రెడ్‌కార్డ్ చూపుతున్న రిఫరీ

నాకౌట్ బెర్త్‌లు ఖరారు

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022లో గ్రూప్ దశ లీగ్ పోటీలు ముగిసాయి. శుక్రవారం రాత్రి బ్రెజిల్-కామరూన్ జట్ల మధ్య జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌తో ఈ సీజన్ ఫిఫా గ్రూప్ లీగ్ పోటీలు ముగిసాయి. 8గ్రూపుల ఫిఫా గ్రూప్ పోటీల్లో ఆతిథ్య కతార్‌తోపాటు ఆసియా ఖండానికి చెందిన ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, జపాన్ జట్లు సంచలన విజయాలను నమోదు చేసుకున్నాయి. గ్రూప్-సి తొలి లీగ్ పోటీలోనే సౌదీ అరేబియా జట్టు 2-1గోల్స్ తేడాతో అర్జెంటీనాకు ఓడించి పెను సంచలనాన్ని నమోదు చేయగా.. ఆ తర్వాత జపాన్ జట్టు జర్మనీని చిత్తుచేసి మరో సంచలనాన్ని తెరలేపింది. ఇదే క్రమంలో దక్షిణ కొరియా జట్టు ఉరుగ్వేలతో మ్యాచ్‌ను డ్రా చేసుకొని ఫేవరెట్ జట్లలో ఒకటిగా నిలిచింది. ఆతిథ్య కతార్ మినహా.. ఆసియా ఖండానికి చెందిన మిగిలిన నాలుగు జట్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత సౌదీ అరేబియా, ఇరాన్ జట్లు పోరాడినా ప్రి క్వార్టర్స్‌కు చేరడంలో విఫలమైతే.. చివరి లీగ్ మ్యాచుల్లో జపాన్ జట్టు స్పెయిన్‌ను, దక్షిణ కొరియా జట్టు పోర్చుగల్‌ను ఓడించి ఏకంగా నాకౌట్‌కు చేరకున్నాయి.

లీగ్ దశలోనే నిష్క్రమించిన ఫేవరెట్ జట్లు..

లీగ్ దశలోనే ఈసారి టాప్‌క్లాస్ జట్లు నిష్క్రమించాయి. గ్రూప్-సిలో మెక్సికోతోపాటు, గ్రూప్ ఆఫ్ డెత్‌గా పరిగణించిన గ్రూప్-డిలో ట్యునీషియా, డెన్మార్క్ జట్లు లీగ్ దశను దాటలేకపోయాయి. అలాగే గ్రూప్-ఇ నుంచి మాజీ ఛాంపియన్ జర్మనీ, గ్రూప్-ఎఫ్‌లో బెల్జియంతోపాటు గ్రూప్-జి నుంచి కామరూన్, గ్రూప్-హెచ్ నుంచి మాజీ ఛాంప్ ఉరుగ్వే లీగ్ దశను దాటలేకపోయింది. ఈ జట్లన్నీ తొలి మ్యాచ్‌లో ఓటమి ఆ జట్టు నాకౌట్ బెర్త్ చేరికపై ప్రభావాన్ని చూపాయని చెప్పుకోవచ్చు. శనివారం నుంచి ప్రి క్వార్టర్‌ఫైనల్ పోటీలు ప్రారంభం కాగా.. 9నుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

యువ క్రికెటర్లకు సదవకాశం

బంగ్లాదేశ్‌తో తొలి వన్డే నేడు
షమీ ఔట్.. ఉమ్రన్ ఇన్..
ఉదయం 11.30గం॥ల నుంచి

ఢాకా: టీమిండియా జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో భాగంగా ఆదివారం నుంచి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఇరుజట్ల మధ్య జరిగే తొలి వన్డేకు ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో జరగనుంది. వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా సీనియర్ పేసర్ షమీ ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భుజం గాయంతో షమీ ఇబ్బందిపడుతున్నట్లు బిసిసిఐ శనివారం ట్విట్టర్‌లో వెల్లడించింది. షమీ స్థానంలో భారత యువ పేసర్ ఉమ్రాన్ మాలిక్‌కు జట్టులో చోటు కల్పించినట్లు పేర్కొంది. 'బంగ్లాతో వన్డే సిరీస్‌కు ముందు నిర్వహించిన ట్రైనింగ్ సెషన్‌లో షమీకి గాయమైంది. అతడు ప్రస్తుతం ఎన్‌సీఏ పర్యవేక్షణలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లిన జట్టుతో అతడు వెళ్లలేదు' అని బిసిసిఐ తెలిపింది. వన్డే సిరీస్ ముగిసిన అనంతరం 14 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది.



వన్డే సిరీస్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న భారత్, బంగ్లాదేశ్ కెప్టెన్లు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -290484, and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Bendi Tulasi Das, Ph.9490099275, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2019/78422